యువత వారానికి 70 గంటలు పనిచేయాలి

- దేశంలో పని సంస్కృతి మారాల్సిన అవసరముంది
- అప్పుడే అగ్రరాజ్యాలతో భారత్ పోటీపడగలదు
- ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: దేశంలో పనిసంస్కృతి మారాల్సిన అవసరం ఉన్నదని, యువత వారానికి 70 గంటలు పనిచేయాలని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ ఆర్ నారాయణమూర్తి సూచించారు. గత రెండు మూడు దశాబ్దాలలో అద్భుతమైన ప్రగతిని సాధించిన దేశాలతో పోటీ పడాలంటే యువకులు ఎక్కువగా కష్ట పడక తప్పదని పేర్కొన్నారు. '3వన్4 పాడ్‌కాస్ట్' వారి తొలి ఎపిసోడ్ 'ది రికార్డ్'లో నారాయణమూర్తి వ్యక్తం చేసిన అభిప్రాయాల వీడియోను గురువారం యూట్యూబ్‌లో విడుదల చేశారు. జాతి నిర్మాణం, సాంకేతికత, తమ ఇన్ఫోసిస్ కంపెనీతోపాటు అనేక విషయాలపై ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. భారత్‌లో పని ఉత్పాదకత ప్రపంచంలోనే అతి తక్కువ అని చెప్పారు. చైనా వంటి దేశాలతో పోటీ పడాలంటే దేశ యువత తమ పని గంటలను పెంచాలని, రెండో ప్రపంచ యుద్ధం తరువాత జపాన్, జర్మనీలు అలాగే చేశాయని తెలిపారు. భారత్‌లో పని ఉత్పాదకత తగ్గడానికి ప్రభుత్వంలో అవినీతి, అధికారుల అలసత్వం కూడా కారణమని అభిప్రాయపడ్డారు. ఇది పోనంతవరకు అగ్ర రాజ్యాలతో పోటీపడలేమని స్పష్టం చేశారు.

చాక్లెట్లలో ప్రమాదకర స్థాయిలో సీసం, క్యాడ్మియం!

న్యూఢిల్లీ: పిల్లలు, పెద్దలు ఎంతో ఇష్టంగా తినే చాక్లెట్లలో ఆరోగ్యానికి హాని చేసే సీసం, క్యాడ్మియం అధికంగా ఉన్నట్లు కన్స్యూమర్ రిపోర్ట్స్ అనే సంస్థ వెల్లడించింది. అమెరికాలోని ఏడు క్యాటగిరీల్లో 48 చాక్లెట్ ఉత్పత్తులను పరీక్షించినట్లు సంస్థ తెలిపింది. 16 ఉత్పత్తుల్లో ఈ లోహాలు ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు వెల్లడించింది. డార్క్ చాక్లెట్ బార్స్, మిల్క్ చాక్లెట్ బార్స్, కోకో పౌడర్, చాక్లెట్ చిప్స్, హాట్ కోకో మిక్స్, బ్రౌనీస్, చాక్లెట్ కేక్‌లను పరీక్షించినట్లు తెలిపింది. చాక్లెట్ల ద్వారా ఈ లోహాలు ఎక్కువ కాలం శరీరంలోకి చేరడం వల్ల నరాల వ్యవస్థ, రోగనిరోధక వ్యవస్థ, మూత్ర పిండాలు దెబ్బతింటాయని తెలిపింది. ముఖ్యంగా గర్భిణులు, చిన్నారులు ఎక్కువగా నష్టపోతారని వివరించింది.

రోజూ 22 నిమిషాల వ్యాయామంతో ఆరోగ్య రక్ష

న్యూఢిల్లీ: ఇళ్లలో, కార్యాలయాల్లో రోజుకు 9 -10 గంటలపాటు కూర్చునేవారికి స్థూలకాయం, గుండెజబ్బులు, క్యాన్సర్లు వచ్చే అవకాశాలు ఎక్కువ. రోజుకు 8 గంటలపాటు కూర్చునేవారి కన్నా రోజుకు 12 గంటలపాటు కూర్చునేవారు మరణించే అవకాశం 38% ఎక్కువగా ఉంటుందని తాజా అధ్యయనంలో తేలింది. రోజుకు 22 నిమిషాల కన్నా తక్కువసేపు వ్యాయామం చేసేవారిలో ఈ ముప్పు కనిపించింది. 50 ఏళ్ల కుపైబడిన వయసుగల వారు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. ఒకేసారి 22 నిమిషాలపాటు వ్యాయామం చేయలేని వారు అప్పుడప్పుడూ కొంత సేపు చేసినా సత్ఫలితాలు కనిపించాయి. అంటే రోజుకు కనీసం 22నిమిషాలు వ్యాయామం చేస్తే మరణించే అవకాశాలు తగ్గుతాయన్నమాట.

కర్ణాటకలోని రాయ్‌చూర్‌లో ట్యాంకర్ల ద్వారా పొలాలకు నీటిని సరఫరా చేస్తున్న అన్నదాతలు

కాంగ్రెస్‌ను నమ్ముకొంటే ట్యాంకర్లే గతి!

- కర్ణాటకలో అన్నదాతలను చుట్టుముట్టిన సాగునీటి కష్టాలు
- విద్యుత్తు కోతలతో రాష్ట్రవ్యాప్తంగా ఎండుతున్న పొలాలు
- పంటలను కాపాడుకోవటం కోసం అన్నదాతల ప్రయాస
- జేబులోంచి సొంత డబ్బులు తీసి ట్యాంకర్ల బుకింగ్
- ఎకరానికి 4 వేలు వసూలు చేస్తున్నారని ఆవేదన
- రాయచూర్, యాద్గిర్, గదగ్‌లో రైతుల అవస్థలు
- కరెంటు ఆఫీసుల ముందు కొనసాగుతున్న నిరసనలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): ఐదు నెలల కాంగ్రెస్‌పాలనలో కర్ణాటక రైతులు అరిగోస పడుతున్నారు. ఎవుసానికి నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ గద్దెనెక్కిన తర్వాత ఆ వాగ్దానాన్ని పక్కనబెట్టింది. కనీసం ఐదు గంటలైనా కరెంటివ్వండంటూ అన్నదాతలు రోడ్లెక్కినా పట్టించుకొన్న పాపాన పోలేదు. దీంతో సాగుకు నీరులేకపోవడంతో చేతికొచ్చిన పంట ఎండిపోతున్నది. దీన్ని చూసి తట్టుకోలేని అన్నదాతలు సొంత డబ్బులతో నీటి ట్యాంకర్లను పొలాలకు తెప్పించుకొని పంటను కాపాడుకొంటున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు, వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

రాష్ట్రమంతటా సంక్షోభమే

గడిచిన నెలన్నర వ్యవధిలో దక్షిణ భారతంలో దాదాపు అన్ని ప్రాంతాల్లో వానలు పడలేదు. తెలంగాణతో పాటు పొరుగున ఉన్న కర్ణాటకలోనూ ఇదే పరిస్థితి. అయితే, ఎవుసానికి అమిత ప్రాధాన్యమిచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుచూపుతో సాగుకు అవసరమైన నీటి వసతిని, 24 గంటల ఉచిత విద్యుత్తును తెలంగాణ అన్నదాతలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో వానలు పడకపోయినప్పటికీ, రాష్ట్రంలో రైతులు సంబురంగా ఎవుసాయ పనులు చేసుకొంటున్నారు. ఇక, కర్ణాటకలో దీనికి పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొన్నది. ఎన్నికల ప్రచారంలో వ్యవసాయానికి నిరంతరాయ విద్యుత్తును ఇస్తామన్న కాంగ్రెస్ ఆ తర్వాత ఆ హామీని తుంగలో తొక్కింది. సాగుకు కనీసం గంటసేపైనా విద్యుత్తు సరఫరా చేయట్లేదు. దీంతో రాయచూర్, యాద్గిర్, గదగ్ తదితర జిల్లాల్లోని వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే దుస్థితి దాపురించింది. సాగుకు కనీసం 5 గంటల కరెంటునైనా ఇవ్వండంటూ ఆయా జిల్లాల్లోని రైతులు ఎల్టీకేస్ సబ్ స్టేషన్లు, విద్యుత్తు కార్యాలయాల ముందు నిరసనలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ, సమస్య పరిష్కారం కాలేదు. దీంతో చేసేదేమీలేక, జేబుల్లోంచి సొంత డబ్బులు తీసి నీటి ట్యాంకర్లను తెప్పించి పొలాలను తడుపుతున్నారు. రాష్ట్రంలోని అన్నిప్రాంతాల్లో దాదాపు ఇదే పరిస్థితి తలెత్తినట్టు వార్తలు వస్తున్నాయి.

ట్రిప్పునకు రూ. 500 పెంపు

సాగునీటికి గోస పడుతున్న రైతులను ట్యాంకర్ మాఫియా కొత్త ఇబ్బందులకు గురి చేస్తున్నది. ఎకరం పొలాన్ని పూర్తిగా తడుపడానికి రూ. 4 వేల వరకు రుసుము తీసుకొంటున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. ఒక్కో ట్రిప్పుకు రూ. 500 అదనంగా వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు. పంటలు ఎండిపోతుండటంతో గత్యంతరంలేక అడిగినంత డబ్బు ఇవ్వాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకమే ఇదంతా..

నీటి సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోయే దుస్థితి దాపురించింది. వానలు కూడా లేకపాయె. ఇక, నీటి ట్యాంకర్లు తెప్పించుకొని పంటలను కాపాడుకొంటున్నాం. ఇదే అదునుగా ట్యాంకర్ ఓనర్లు ఎక్కువగా చార్జ్ చేస్తున్నారు. గత్యంతరం లేనిపరిస్థితుల్లో డబ్బులు చెల్లించాల్సి వస్తున్నది. ఇదంతా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకమే.

– శరణు గౌడార్, రైతు, లక్ష్మేశ్వర్ గ్రామం, గదగ్ జిల్లా

కొనసాగుతున్న రైతు నిరసనలు

విద్యుత్తు కోతలకు నిరసనగా కర్ణాటకవ్యాప్తంగా రైతన్నల నిరసనలు కొనసాగుతున్నాయి. వ్యవసాయానికి సరిపడినంత విద్యుత్తు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పలు విద్యుత్తు కార్యాలయాల ముందు గురువారం కూడా అన్నదాతలు ఆందోళనలు చేపట్టారు. విజయపుర జిల్లా కొల్హారా తాలూకాలోని రోణిహాల్ గ్రామ రైతులు.. హుబ్లీ ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ కార్యాలయానికి ఓ ట్రాక్టర్‌లో మొసలిని తీసుకొచ్చి ఇటీవల నిరసన వ్యక్తం చేశారు. గుల్బర్గా జిల్లాలో రైతన్నలు పురుగుల మందుల డబ్బాలతో విద్యుత్తు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఇక, కోతలను నిరసిస్తూ కర్ణాటక ఫార్మర్స్ అసోసియేషన్ (కేఎఫ్ఎ) ఆధ్వర్యంలో మంగళవారం మైసూరులోని బెంగళూరు-మైసూరు హైవేను రైతన్నలు దిగ్బంధించేందుకు యత్నిస్తే, కేఎఫ్ఎ అధ్యక్షుడు కురుబూర్ శాంతకుమార్ సహా పలువురు రైతు నేతలను పోలీసులు అరెస్ట్ చేయడం, ఈ అరెస్టులను విపక్షాలు ఖండించడం తెలిసిందే.

18 సార్లు ఓడినా మళ్లీ..

ఇండోర్, అక్టోబర్ 26: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన పరమానంద్ తొలాని అలియాస్ ఇండోరి ధార్తి పకడ్‌ది ఆసక్తికరమైన ఉదంతం. 60 ఏండ్లు దాటిన తొలాని ఇంతవరకు 18 సార్లు ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. అయితే కనీసం డిపాజిట్ రాకపోయినా తన ప్రయత్నం మాత్రం మానలేదు. ఈసారి ఆయన ఇండోర్ జిల్లా సన్వేర్ నుంచి 19వ సారి పోటీ చేస్తున్నట్టు ప్రకటించారు. తానేదో ఎన్నికల్లో విజయం సాధించి పదవి చేపట్టాలన్న ఆశ లేదని, ఇలా ఎన్నికల్లో పోటీ చేయడం కుటుంబ సంప్రదాయంగా వస్తున్నట్టు చెప్పుకొచ్చారు. తన తండ్రి మరణించే వరకు 1950 నుంచి 1988 వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారని చెప్పారు.

'ఇండియా' కూటమిలో పీఎం పదవిపై పోస్టర్ల లొల్లి

లక్నో: ప్రతిపక్ష ఇండియా కూటమిలో అప్పుడే ప్రధాని పదవిపై రచ్చ మొదలైంది. పార్టీల మధ్య పోస్టర్ వార్ నడుస్తున్నది. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ భావి ప్రధాని అంటూ ఆ పార్టీ కార్యాలయం వద్ద సోమవారం ఓ పోస్టర్ వెలిసింది. కాంగ్రెస్ కార్యాలయం వద్ద తాజాగా ఓ పెద్ద బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో ఆ పార్టీ నేతలు రాహుల్ గాంధీతోపాటు, ఉత్తర ప్రదేశ్ పీసీసీ చీఫ్ అజయ్ రాయ్ కూడా ఉన్నారు. '2024లో రాహుల్ గాంధీ పీఎం, 2027లో అజయ్ రాయ్ సీఎం' అని దీనిలో ఉంది. దీనిపై సమాజ్‌వాదీ పార్టీ మండిపడింది. కాంగ్రెస్ ఎన్ని పోస్టర్లు ఏర్పాటుచేసినా, అఖిలేశ్ యాదవే ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆ పార్టీ నేత హసన్ పేర్కొన్నారు.

త్రిపుర గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): త్రిపుర గవర్నర్‌గా నల్లు ఇంద్రసేనారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఉదయం ఆగర్తలాలో త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్.. నల్లు ఇంద్రసేనారెడ్డిచేత ప్రమాణంచేయించారు. ముందుగా, నల్లు ఇంద్రసేనారెడ్డి దంపతులు అగర్తలా విమానాశ్రయంలో దిగగానే, త్రిపుర సీఎం డాక్టర్ మాణిక్ సాహా, మంత్రివర్గ సహచరులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సీనియర్ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఘన స్వాగతం పలికారు. ప్రమాణ స్వీకారం అనంతరం రాజ్‌భవన్‌లో సీఎం మాణిక్ సాహా, సీనియర్ అధికారులతో నల్లు ఇంద్రసేనారెడ్డి భేటీ అయ్యారు.

'నిర్లక్ష్యం కారణంగా మరణం.. దోషులకు ఐదేండ్ల శిక్ష'

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: నిర్లక్ష్యంగా కారణంగా మరణాలు సంభవించే ఘటనల్లో దోషులకు విధించే శిక్ష రెండేండ్ల నుంచి ఐదేండ్లకు పెంచాలని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ భావిస్తున్నది. ఈమేరకు కమిటీ సిఫారసు చేయనున్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. క్రిమినల్ చట్టాల్ని సమూలంగా మార్చేస్తూ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్రం మూడు కొత్త బిల్లుల్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ బిల్లులకు హిందీలో కాకుండా ఇంగ్లిష్ పేర్లను నిర్ణయించాలని కమిటీలోని విపక్ష పార్టీల సభ్యులు కోరగా, దీనిని కమిటీ కొట్టిపారేసింది.

ఎక్స్‌లో ఇకపై ఆడియో, వీడియో కాల్స్

న్యూఢిల్లీ: వాట్సాప్‌కు పోటీగా ఎలాన్ మస్క్ యాజమాన్యంలోని ఎక్స్ (ట్విట్టర్) ఆడియో, వీడియో కాల్స్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీనిని యాక్టివేట్ చేసుకోవాలంటే సెట్టింగ్స్‌లోకి వెళ్లి 'ప్రైవసీ సేఫ్టీ' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అనంతరం 'డైరెక్ట్ మెసేజ్' ఆప్షన్‌ను ఎంచుకొని, 'ఎనేబుల్ ఆడియో, వీడియో కాలింగ్' ఫీచర్‌ను ఎనేబుల్ చేసుకోవాలి. ఫాలోవర్స్, వెరిఫైడ్ యూజర్స్ లేదా అందరితో మాట్లాడుకొనే విధంగా ఆప్షన్లు ఇచ్చారు.

ఇరుకు గదుల్లో తీవ్ర అవస్థలు

- బ్రిటన్‌లో భారతీయ విద్యార్థుల వెతలు
- ఒక్కొక్కరి ఇంటి అద్దె నెలకు లక్షల్లోనే
- అయినా మంచి ప్రదేశంలో ఇల్లు గగనమే

లండన్, అక్టోబర్ 26: బ్రిటన్‌లో భారతీయ విద్యార్థుల కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఉన్నత చదువుల కోసం అక్కడికి వెళ్లిన విద్యార్థులు నిలువ నీడలేక హాహాకారాలు చేస్తున్నారు. ముగ్గురు నలుగురు ఉండాల్సిన గదుల్లో 8-10 మంది సర్దుకొంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పడుకోవటానికి చోటు లేని గదులకు కూడా ఒక్కో విద్యార్థి నెలకు రూ.లక్షకుపైగానే అద్దె చెల్లించాల్సి వస్తున్నది. ఆర్థిక మందగమనంలో ఉన్న బ్రిటన్‌లో నివాస భవనాల నిర్మాణం తగ్గుముఖం పట్టడంతో భారతీయ విద్యార్థులకు అద్దె ఇల్లు దొరకబట్టుకోవటం భగీరథ ప్రయత్నంగా మారింది.

లక్షల్లోనే అద్దె

అసలే ఇరుకు గదులు.. అయినా లక్షల్లో అద్దె చెల్లించాల్సి వస్తున్నదని విద్యార్థులు వాపోతున్నారు. యూనివర్సిటీ కాలేజ్ లండన్ (యూసీఎల్)లో ఇటీవలే డిగ్రీ పూర్తిచేసిన శ్రద్ధా చక్రవర్తి తన గోడును వెళ్లబోసుకున్నారు. లండన్‌లోని కింగ్స్ క్రాస్ ప్రాంతంలో అద్దెకు ఉన్న ఆమె వారానికి ఇంటి అద్దె రూ.30,124 (299 పౌండ్లు) చెల్లించినట్టు తెలిపారు. ఈ లెక్కన నెలకు ఇంటి అద్దె రూ.1.2 లక్షలకు పైమాటే. అంటే ఒక గదిలో నలుగురు విద్యార్థులు అద్దెకు ఉంటే.. అందరూ కలిసి నెలకు అక్షరాలా రూ.5 లక్షలు అద్దె చెల్లించాల్సి వస్తున్నది. 'ఐదుమంది మాత్రమే ఉండగలిగే గదిలో 8 మందిమి సర్దుకొంటున్నాం. అందరికీ ఒకటే స్నానాల గది. ఒకటే వంటగది. అద్దె ఇల్లు వెతుక్కోవటంలోనే నా సమయమంతా గడిచిపోతున్నది. చదువు అయిపోయిన తర్వాత నాకు చాలాకాలం ఉద్యోగం లభించలేదు. ఎక్కడా పార్ట్‌టైమ్ ఉద్యోగం కూడా దొరకలేదు. దీంతో నా చేతిలో 30 పౌండ్లు మాత్రమే మిగిలాయి. రూమ్‌లో అందరూ తినగా మిగిలిన ఆహారాన్ని తినేవాడిని. ఎట్టకేలకు ఓ ఇండియన్ రెస్టారెంట్‌లో జాబ్ సంపాదించాను. అందులో ఏడాదిపాటు పనిచేసిన తర్వాత ఇప్పుడు హెల్త్‌కేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాను' అని ఎమ్మెస్సీ సప్లై చైన్ మేనేజ్‌మెంట్ కోర్సు చదవటానికి వెళ్లిన అరుణ్‌పాట్రిక్ అనే విద్యార్థి తన గోడు వెళ్లబోసుకొన్నాడు. ఇతడు కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో బ్రిటన్ వెళ్లాడు. ఇప్పటికీ అక్కడ పరిస్థితులు ఏమీ మారలేదని పలువురు విద్యార్థులు తెలిపారు.

విద్యార్థులు ఎక్కువ.. ఇండ్లు తక్కువ

మంచి అద్దె ఇల్లు వెతుక్కోవటానికి తనకు ఆరు నెలల సమయం పట్టిందని యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్‌లో ఇటీవలే చేరిన సిమ్రన్ మెలాల్ తెలిపారు. ఇలా అద్దె ఇండ్ల సంక్షోభం ఏర్పడటానికి కారణం బ్రిటన్‌లో ఆర్థిక మందగమనమే. 2020లో ఆ దేశంలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 29,048 గదులను నిర్మించగా, 2023 నాటికి అది 13,543కు పడిపోయింది. విద్యార్థుల వలస మాత్రం పెరుగుతూనే ఉన్నది. 2019లో 36,612 మంది భారతీయ విద్యార్థులు బ్రిటన్ వెళ్లగా, ఆ సంఖ్య 2021నాటికి 77,855కు చేరింది. 2022 సంవత్సరంలో బ్రిటన్‌లో 55,465 మంది భారతీయ విద్యార్థులు ఉన్నట్టు కేంద్రప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయి. కొత్తగా ఇండ్లు కట్టడానికి భూమి సరిపోకపోవటంతో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఇండ్లు నిర్మించటాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎడిన్‌బరో ప్రాంతంలో ఇటీవల ఓ కంపెనీ భారీ స్థాయిలో విద్యార్థుల గదుల నిర్మాణానికి పూనుకోగా స్థానికులు అడ్డుకొన్నారు. చాలాప్రాంతాల్లో ఆసియా విద్యార్థులకు ఇండ్లు అద్దెకు ఇచ్చేందుకు ఓనర్లు నిరాకరిస్తున్నారు.

8 మంది భారత నేవీ మాజీ అధికారులకు మరణశిక్ష

- ఖతార్ కోర్టు సంచలన తీర్పు
- గూఢచర్యం ఆరోపణలపై శిక్ష
- న్యాయపోరాటం చేస్తామన్న భారత్

దోహా, అక్టోబర్ 26: గూఢచర్యం కేసులో భారత నావికాదళానికి చెందిన 8 మంది మాజీ అధికారులకు మరణ దండన విధిస్తూ ఖతార్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రైవేట్ సంస్థ దోహ్రా గ్లోబల్ టెక్నాలజీస్, కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో పనిచేస్తున్న వీరిపై ఇజ్రాయెల్ కోసం గూఢచర్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలు నమోదయ్యాయి. ఖతార్ అధికారులు వీరిని గత ఏడాది ఆగస్టులో అరెస్ట్ చేశారు. ఈ కేసులో వారు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వీరికి మరణశిక్ష విధిస్తూ 'కోర్ట్ ఆఫ్ ఫస్ట్ ఇన్‌స్టాన్స్ ఆఫ్ ఖతార్' గురువారం తీర్పు వెలువరించింది. దీనిపై భారత ప్రభుత్వం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. న్యాయపరంగా దీనిని ఎదుర్కొంటామని, అన్ని మార్గాల్ని వినియోగిస్తామని భారత విదేశాంగ శాఖ పేర్కొన్నది.

అన్ని దారులూ అన్వేషిస్తున్నాం..

'కోర్టు తీర్పుతో షాక్‌కు గురయ్యాం. తీర్పు పూర్తి ప్రతి కోసం ఎదురుచూస్తున్నాం. నేవీ మాజీ ఉద్యోగుల కుటుంబ సభ్యులతో మా లీగల్ టీం మాట్లాడింది. వారిని విడుదల చేయడానికి ఉన్న దారులను అన్వేషిస్తాం' అని విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. కెప్టెన్ నవతేజ్ సింగ్ గిల్, కెప్టెన్ బీరేంద్ర కుమార్ వర్మ, కెప్టెన్ సౌరభ్, కమాండర్ అమిత్ నాగ్‌పాల్, కమాండర్ తివారీ, కమాండర్ సుగుణాకర్ పాకాల, కమాండర్ సంజీవ్ గుప్తా, సెయిలర్ రాగేశ్‌లను ఖతార్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ 2022 ఆగస్టు 30న అరెస్టు చేసింది. ఇజ్రాయెల్ తరపున వీరంతా ఓ సబ్‌మెరైన్ ప్రోగ్రాం కోసం గూఢచర్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలు వీరిపై నమోదయ్యాయి. ఈ కేసులో తమ వద్ద ఎలక్ట్రానిక్ సాక్ష్యాధారాలు ఉన్నాయని ఖతార్ అధికార యంత్రాంగం చెబుతున్నది.

ప్రధానిని వేడుకున్నా ఫలితం శూన్యం

తమ వాళ్లను ఖతార్ ప్రభుత్వం నిర్బంధించటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబ సభ్యుల్లో ఒకరు ప్రధాని మోదీకి గత ఏడాది లేఖ కూడా రాశారు. ఈ కేసులో తమ సోదరుడిని విడిపించేందుకు భారత ప్రభుత్వం సాయం చేయాలంటూ ఓ యువతి ప్రధాని మోదీని వేడుకున్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లను ట్యాగ్ చేస్తూ, 'దేశ గౌరవాన్ని పెంచిన నేవీ మాజీ అధికారుల్ని తిరిగి భారత్‌కు రప్పించాలి. ప్రధాని మోదీని చేతులు జోడించి వేడుకుంటున్నా' అంటూ ట్వీట్ చేశారు.

మహువాకు ఎథిక్స్ కమిటీ సమన్లు

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా పార్లమెంటులో ప్రశ్నలు అడగడం కోసం ఓ వ్యాపారవేత్త నుంచి ముడుపులు స్వీకరించినట్లు వచ్చిన ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ విచారణ ప్రారంభమైంది. ఈ ఆరోపణలు చేసిన న్యాయవాది జై అనంత్ దేహద్రాయ్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే స్టేట్‌మెంట్లను గురువారం ఈ కమిటీ నమోదు చేసింది. ఈ కేసులో తన వాదనను వినిపించేందుకు ఈ నెల 31న తమ ఎదుట హాజరుకావాలని మహువాను కోరినట్లు ఈ కమిటీ చీఫ్, బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ సోన్‌కర్ చెప్పారు.

కాంగ్రెస్, బీజేపీ.. గిరిజన వ్యతిరేకులు

ఛత్తీస్‌గఢ్‌లో పీపుల్స్‌వార్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్,(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్, బీజేపీ నాయకులందరూ గిరిజన వ్యతిరేకులేనని పీపుల్స్‌వార్ ఆరోపించింది. ఆ రెండు పార్టీల నేతలకు ఓట్లు వేసి గెలిపించి లాభం లేదని, ఛత్తీస్‌గఢ్ నుంచి కాంగ్రెస్, బీజేపీ నాయకులను తరిమి కొట్టాలని పిలుపునిచ్చింది. దక్షిణ సబ్ జోనల్ బ్యూరో పేరిట జారీ చేసిన ఓ లేఖలో పీపుల్స్‌వార్ నాయకులు ఎన్నికలను బహిష్కరించాలని బస్తర్ ప్రాంత ప్రజలకు పిలుపునిచ్చారు. పీపుల్స్‌వార్ అధికార ప్రతినిధి సమత జారీ చేసిన ఈ ప్రకటనలో, బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేట్ తొత్తులని మండిపడ్డారు.

మోదీతో వేదిక పంచుకోను

మిజోరం సీఎం జోరం తంగా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): బీజేపీ మిత్రపక్ష నాయకుడు, మిజోరం సీఎం జోరం తంగా ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. ప్రధానితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనబోమని, వేదిక పంచుకోనని ప్రకటించారు. మణిపుర్ అల్లర్ల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో వందల చర్చిలు ధ్వంసమయ్యాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇదంతా చూస్తూ ఊరుకుందని, ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీతో ఎన్నికల సభలో పాల్గొనలేనన్నారు.

అమెరికాలో కాల్పుల కలకలం

మైనేలో దుండగుడి కాల్పుల్లో 18 మంది దుర్మరణం



లివిస్టన్, అక్టోబర్ 26: అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. ఓ దుండగుడు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 18 మంది దుర్మరణం చెందారు. 13 మంది గాయపడ్డారు నిందితుడి కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. వివరాల్లోకెళితే, మైనేలోని లెవిస్టన్‌లోగల బార్ అండ్ రెస్టారెంట్, బౌలింగ్ అలే వద్ద బుధవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ఈ కాల్పులు చోటుచేసుకొన్నాయి. రద్దీగా ఉన్న ప్రాంతాల్లోకి సెమీ ఆటోమేటిక్ రైఫిల్‌తో ప్రవేశించిన దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురై, పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితుడు గతంలో యూఎస్ ఆర్మీలో పనిచేసిన రిజర్వ్ సభ్యుడు రాబర్ట్ కార్ట్ (40)గా పోలీసులు గుర్తించారు.

'మేజర్లు నచ్చిన వ్యక్తిని మనువాడొచ్చు'

న్యూఢిల్లీ: తమకు నచ్చిన వ్యక్తిని పెండ్లి చేసుకునే హక్కు మేజర్లకు ఉందని, కుటుంబ సభ్యులు అభ్యంతరం చెప్పడానికి వీల్లేదని ఢిల్లీ హైకోర్టు తీర్పు చెప్పింది. పెండ్లి చేసుకున్న ఓ జంట పోలీసు రక్షణ కోసం చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించింది. వీరిద్దరికీ రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. బంధువుల నుంచి తమకు బెదిరింపులు వస్తున్నాయని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ఫేక్ సమాచారానికి చెక్!

న్యూఢిల్లీ : యూజర్లకు నాణ్యమైన సమాచారాన్ని అందివ్వాలని నిర్ణయించుకున్న గూగుల్ 'అబౌట్ దిస్ ఇమేజ్' అనే ఫ్యాక్ట్ చెక్ టూల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫొటోల క్రెడిబిలిటీని ఈ టూల్ ద్వారా నిర్ధారించుకోవచ్చు.ఫొటో చరిత్ర, మెటా డాటాతోపాటు వేర్వేరు సైట్లలో దీనిని ఎవరెవరు ఉపయోగించారు అన్న వివరాలను కూడా ఒక్క క్లిక్‌తో యూజర్లు తెలుసుకునే వీలుంటుంది. ఇమేజ్‌పైన కనిపించే మూడు డాట్లపై క్లిక్ చేయడం ద్వారా పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు.

ఫోన్ వ్యసనంతో పిల్లల్లో ఆటిజం

టోక్యో : ఫోన్ ఎక్కువగా చూసే